

కొండ పోరంబోకు భూములపై డేగల కన్ను

అధికార పార్టీ నేతల అండదండలతో ఓ వ్యక్తి 67 ఎకరాల కొండపోరంబోకు భూములను ఆక్రమించి రూ.2 కోట్లకు విక్రయించాడు.

- 8లో..



పొగాకు రైతులపై పచ్చపాతం

కూటమి ప్రభుత్వం పొగాకు రైతులను నిర్లక్ష్యం చేస్తోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కరరెడ్డి విమర్శించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34 /25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నాగులుప్పలపాడుకు తొలి మహిళా ఎస్సై

● బాధ్యతలు స్వీకరించిన షేక్ రజియా సుల్తానా



షేక్ రజియా సుల్తానా

నాగులుప్పల పాడు: స్థానిక పోలీస్‌స్టేషన్‌కు మొదటిసారి మహిళా ఎస్సైను నియమించారు. నూతన ఎస్సైగా షేక్ రజియా సుల్తానా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వర్తించిన బి.శ్రీకాంత్‌పై పలు ఆరోపణలు రావడం, ఎస్పీ దామోదర్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ఎస్పీ ఆదేశాల మేరకు నాగులుప్పలపాడు స్టేషన్‌కు ఎస్సైగా రజియా సుల్తానాను నియమించడంతో ఆదివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఏర్పడిన తర్వాత తొలిసారి బాధ్యతలు చేపట్టిన మహిళా ఎస్సైకి సిబ్బంది అభినందనలు తెలిపారు.

దళితులపై దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి

ఒంగోలు వన్‌టౌన్: రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా మాలలు మరో పోరాటానికి సన్నద్ధం కావాలని దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని ప్రభుత్వ సముదాయాల కార్యాలయం వద్ద ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంగళరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు, సోషల్ బహిష్కరణలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు పలువురు పాల్గొన్నారు.

అదో పీడకల.. 2014–19 మధ్య పొగాకు రైతులకు అన్నీ కష్టాలే.. ఆ రోజులు తలుచుకుంటేనే రైతు వెన్నుల్లో వణుకుపుడుతోంది. మద్దతు ధరల కోసం నిరంతరం పోరాటాలు చేయాల్సిందే. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కనీస మద్దతు ధర సరాసరి రూ.118 దాటని పరిస్థితి. నష్టాలు మూటగట్టుకున్న రైతులు పొగాకు సాగుచేయాలంటే భయపడిపోయిన పరిస్థితులు నాడు నెలకొన్నాయి. నేడు అదే పరిస్థితులు మళ్లీ కనిపిస్తున్నాయి. వేలం ప్రారంభమై 70 రోజులు కావస్తోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా వేలం కేంద్రాల్లో ధరలు రాకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. రైతులకు అండగా నిలవాల్సిన పొగాకు బోర్డు, కూటమి ప్రభుత్వం ప్రకటనలతో కాలక్షేపం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ధర రోడ్డెక్కి.. బతుకులు చితికి!

- టీడీపీ గత ఐదేళ్ల పాలనలోనూ పొగాకు రైతులకు దక్కని మద్దతు ధర
- ధరల కోసం నాటి చంద్రబాబు పాలనలోనూ ఐదేళ్లపాటు రైతుల పోరాటాలు
- మరోసారి చంద్రబాబు పాలనలో కుదేలవుతున్న పొగాకు రైతులు
- ప్రస్తుతం పొగాకు వేలంలో ధరలు రాక భారీ నష్టాలు మూటగట్టుకుంటున్న రైతులు
- ఆదుకునేందుకు కనీస ప్రయత్నం చేయని కూటమి ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

తెలుగుదేశం పాలన అంటేనే రైతులకు ఓ శాపంలా మారుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధరల కోసం నిరంతర పోరాటాలు చేయాల్సిందే. అందుకు నిదర్శనం ప్రస్తుతం పొగాకు పంటకు ధరలు లేక రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితులు. జిల్లాలో ప్రధాన వాణిజ్య పంటయిన పొగాకు రైతుల వెన్నువిరిచేలా చంద్రబాబు పాలనలో ధరలు పతనమయ్యాయని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న మార్కెట్ ప్రకారం రైతులకు కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. దీంతో రైతులు మద్దతు ధరల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 2014–19 మధ్య సాగిన చంద్రబాబు పాలనలోనూ పొగాకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధరల కోసం నిరంతరం పోరాటాలు చేయాల్సి వచ్చింది. అయినా రైతులకు మాత్రం మద్దతు ధరలు దక్కిన దాఖలాలు లేవు. దీంతో పొగాకు రైతులు తీవ్ర నష్టాలపాలై పొగాకు పంట సాగుచేసేందుకు కూడా ముందుకు రాని పరిస్థితులు ఉండేవి. ప్రస్తుతం అదే పరిస్థితులను పొగాకు రైతాంగం ఎదుర్కొంటోంది.

నాటి ఐదేళ్లూ తీవ్ర నష్టాలే...

చంద్రబాబు పాలనలో పొగాకు రైతులకు ఏనాడూ మద్దతు ధర దక్కిన పాపానపోలేదు. అందుకు 2014–19 మధ్య జరిగిన పాలనలో పొగాకు రైతులకు దక్కిన ధరలే నిదర్శనం. ఉమ్మడి ప్రకాశం జిల్లా కింద మొత్తం 11 పొగాకు వేలం కేంద్రాలున్నాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన మరుసటి ఏడాదే.. అంటే 2014–15 సీజన్‌కు సంబంధించి పొగాకు ధరలు దారుణంగా పడిపోయాయి. అప్పట్లో విదేశీ ఆర్డర్లు రావడం లేదనే కారణంతో పొగాకు కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. దీంతో పండించిన పొగాకు అతి తక్కువ ధరకు తెగనమ్ముకోవాల్సి వచ్చింది. 2014–15 సీజన్‌లో జిల్లాలో కేజీ పొగాకు సరాసరి ధర రూ 81.37 మాత్రమే అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. అసలు లోగ్రేడ్ రకం పొగాకుకు అయితే కేవలం రూ.45 కూడా రాని పరిస్థితి. ఆ ఏడాది రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ దెబ్బతో 2015–16 సీజన్‌లో పొగాకు సాగుచేసేందుకు రైతులు ముందుకు రాని పరిస్థితి ఏర్పడింది. ఈ సీజన్‌లో బోర్డు అనుమతించిన పరిమితి కంటే కూడా రైతులు పొగాకును తక్కువగా పండించారు. సహజంగా మార్కెట్‌లో ఉత్పత్తులు తక్కువగా ఉన్నప్పుడు డిమాండ్ ఏర్పడి ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. కానీ, ఆ సీజన్‌లో కూడా పొగాకు రైతులు ఛిన్నమైన పరిస్థితినే ఎదుర్కొన్నారు. మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ఉత్పత్తులు లేకపోయినా వ్యాపారులు ధరలు మాత్రం పెంచలేదు. కేవలం ఆ ఏడాది వచ్చిన పొగాకు సరాసరి ధర రూ.112.94 మాత్రమే. దీంతో వరుసగా రెండేళ్లపాటు వచ్చిన తీవ్ర నష్టాలతో అనేక మంది రైతులు పొగాకు సాగు వదిలేసి ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక, 2016–17, 2017–18 సీజన్లలోనూ పొగాకు రైతులు మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ధరల కోసం ఆ ఐదేళ్ల పాలనలో రైతులు ప్రతిరోజూ రోడెక్కి ధర్నాలు చేశారు. అయినా మార్కెట్‌లో ధరలు కల్పించడంలో నాటి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఆర్థికంగా చితికిపోయిన రైతులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం మరోసారి చంద్రబాబు పాలనలో పొగాకు రైతులు ఆనాటి ఐదేళ్ల పాలనలో ఎదుర్కొన్న పరిస్థితులనే ఎదుర్కొంటుండడం గమనార్హం.

ఫ్లాష్ బ్యాక్

సంవత్సరం	పొగాకు సరాసరి ధర
2014–15	రూ.81.37
2015–16	రూ.112.94
2016–17	రూ.116.47
2017–18	రూ.129.96
2018–19	రూ.118.23

పొగాకు రైతులకు అండగా వైఎస్ జగన్...

చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పొగాకు రైతులు నష్టాల పాలవ్వగా, 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే పొగాకు రైతులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణ చర్యలు తీసుకున్నారు. ఒకానొక సందర్భంలో మార్కెట్ ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ప్రభుత్వం తరఫున మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు ఉత్పత్తులను కొనుగోలు చేయించారు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ వాతావరణం ఏర్పడి తప్పనిసరి పరిస్థితుల్లో ధరలు పెంచాల్సి వచ్చింది. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అదనపు పొగాకు అమ్మకాలపై జరిమానాలను రద్దు చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో రైతులకు అదనపు లాభం కూడా చేకూరింది. గతేడాది వరకు పొగాకు పంటకు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు ధరలు దక్కాయి. కేజీ పొగాకు ధర రూ.366 పలకగా, సరాసరి ధర రూ.275 వరకు వచ్చింది. సంవత్సరం తిరిగేలోపు పరిస్థితి తలకిందులైంది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మరోసారి పొగాకు రైతుల పరిస్థితి తారుమారైంది. గిట్టుబాటు ధరలు లేక రైతులు రోడ్డునపడే పరిస్థితులను ఎదుర్కొంటున్నారు..

గతం తలుచుకుంటేనే భయమేస్తోంది...



గతం తలుచుకుంటే భయమేస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 వరకు పొగాకు పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు ఎన్ని ధర్నాలు చేసినా, పొగాకు వేలం నిలిపివేసినా ప్రభుత్వంలో కనీసం చలనం లేదు. అప్పుడు రైతులు ఇంకో పంట సాగుచేయలేక, వచ్చే ఏడాది అయినా ధరలు పెరుగుతాయని ఐదు సంవత్సరాలు పొగాకు సాగు చేసి అప్పుల పాలయ్యారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరోనా సమయంలో కూడా రైతులు లాభాలు పొందారు. అప్పటి పొగాకు వ్యాపారస్తులు ధరలు లేవని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోగా ప్రభుత్వమే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి వ్యాపారుల్లో పోటీ పెంచి రైతులకు మద్దతు ధరలు కల్పించడంలో ప్రముఖ పాత్ర పోషించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పొగాకు ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. రైతులు పలు రకాలుగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– ఏలూరి వంశీకృష్ణ, పొగాకు రైతు, పొందూరు గ్రామం, టంగుటూరు మండలం.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వేదికపై వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి, జూపూడి, బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఆదిమూలపు, మేరుగు, అన్నా రాంబాబు, దద్దాల, తదితరులు



సమావేశానికి భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు నుంచే విజయభేరి

- వేలాది మంది కార్యకర్తల నడుమ వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం
- హాజరైన రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి, ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు బూచేపల్లి, తాటిపర్తి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు
- మార్మోగిన జగన్ నినాదాలు
- విజయోత్సవ సభను తలపించిన సమావేశం

ఒంగోలు టౌన్: ఒంగోలు సభ నుంచే వైఎస్సార్ సీపీ విజయభేరి మొదలైందని, నియోజకవర్గ విస్తృతస్థాయి సభకు తరలివచ్చిన కార్యకర్తలంతా కూటమి పాలకుల వైఫల్యాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కలిసికట్టుగా పనిచేసి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. గత ఎన్నికల్లో 11 అసెంబ్లీ సీట్లు వచ్చినప్పటికీ 40 శాతం ఓటింగ్ వైఎస్సార్ సీపీకి ఉందన్నారు. ఇది జగనన్న మీద ప్రజలకు ఉన్న నమ్మకానికి నిదర్శనమని చెప్పారు. ఆదివారం ఒంగోలు నగరంలోని సాయి ఐటీపీ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం వేలాదిగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలతో విజయోత్సవ సభను తలపించింది. కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య జై జగన్ నినాదాలతో మార్మోగింది. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి ప్రసంగిస్తూ గత జగనన్న ప్రభుత్వం ఇంటింటికి సంక్షేమ పథకాలు అందజేస్తే.. ప్రస్తుత కూటమి పాలకులు ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలంతా సుఖంగా ఉండాలన్న సదుద్దేశంతో సంక్షేమ పథకాల నగదును నేరుగా ప్రజలకు జగనన్న అందజేశారన్నారు. కానీ, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారంటూ టీడీపీ నేతలు దుష్ప్రచారం చేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే లక్షన్నర కోట్ల రూపాయల అప్పు చేసి కనీసం ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో రైతులు ఎక్కువగా ఉంటారన్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకున్న విషయాన్ని వివరించారు. శనగ రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు శనగలు కొనుగోలు చేశారని, పొగాకుకు గిట్టుబాటు ధరలు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి ఆదుకున్నారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతుల బాధలు వినిపించుకోవడం లేదని వైవీ మండిపడ్డారు.

ఓట్లేయని వారికి కూడా సంక్షేమ పథకాలిచ్చిన జగనన్న : కారుమూరి నాగేశ్వరరావు

వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ప్రసంగిస్తూ తనకు ఓటేసిన వారితో పాటు ఓట్లేయని వారికి కూడా జగనన్న సంక్షేమ పథకాలు అందజేస్తే, కూటమి పాలకులు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయకుండా వేధిస్తున్నారని ధ్వజమెత్తారు. పేదలను డాక్టర్లుగా నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి తీర్చిదిద్దితే, దానికి నాలుగడుగులు ముందుకేసిన జగనన్న.. చదువుల విషయంలో దేశంలోనే అగ్రస్థానంలో రాష్ట్రాన్ని నిలబెట్టారని కొనియాడారు. అందుకు భిన్నంగా ఫార్టీ ఇయర్స్ చంద్రబాబు పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని విమర్శించారు.

పార్టీ మారిన కార్పొరేటర్లను చూస్తే జాలేస్తోంది : చెవిరెడ్డి

ఎన్నికల తర్వాత వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీ, జనసేన పార్టీల్లోకి వెళ్లిన కార్పొరేటర్లను చూస్తే జాలేస్తోందని ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. కూటమి నాయకుల గొడవల మధ్య ఎలాంటి గౌరవం లేకుండా అనామకులుగా వారు కొనసాగుతున్నారని, మాతృపార్టీలోకి తిరిగి రావాలని, తిరిగి వచ్చిన కార్పొరేటర్లను తగిన విధంగా గౌరవిస్తామని అన్నారు. రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగుతోందని, ప్రజల పోరాటాలకు అండగా నిలబడతామని స్పష్టం చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రసంగిస్తూ జగనన్న పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని, రైతుల సంక్షేమం కోసం పనిచేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. కరోనా సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకున్నారన్నారు. జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలని కోరారు. దర్శి ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు ఇన్‌చార్జి చుండూరి రవిబాబు నాయకత్వంలో ఒంగోలు గడ్డపై వైఎస్సార్ సీపీ విజయపతాకాన్ని ఎగరేయడం ఖాయమన్నారు. ప్రత్యర్థులు సైతం ఉలిక్కిపడేలా పార్టీ సమావేశాలు నిర్వహిస్తున్నారని చుండూరిని అభినందించారు.


జగనన్నను ఎదుర్కొనే శక్తి లేకనే : తాటిపర్తి

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ప్రసంగిస్తూ ఎవ్వరికీ తలవంచని జగనన్నను ఎదుర్కొనే శక్తి లేకనే టీడీపీ, జనసేన, బీజేపీలు కూటమి కట్టాయని విమర్శించారు. గుంపులుగా వచ్చినప్పటికీ తమ మీద తమకు నమ్మకం లేక చివరకు ఈవీఎంలతో మాయచేసి అధికారంలోకి వచ్చాయని ధ్వజమెత్తారు. చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే దమ్ము లేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబుపై ఇప్పటికే లిక్కర్ కుంభకోణం కేసు ఉందన్నారు. కూటమి పాలనలో బియ్యం, ఇసుక, మద్యం మాఫియాలు రెచ్చిపోతున్నాయని విమర్శించారు. సెకీ ఒప్పందం మీద ఎల్లో మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని, ఇప్పుడు 2 రూపాయలు అదనంగా రేటు పెట్టి విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో రైతులు, వ్యాపారులు నష్టపోతున్నారని, రొయ్యల వ్యాపారానికి క్రాప్ హాలిడే ప్రకటించారని, సినిమా హాళ్లను మూసేస్తున్నారని విమర్శించారు. స్కాములు చేయడం ఒక్కటే చంద్రబాబు పాలనలో జరుగుతోందన్నారు.

మాజీ మంత్రి, కొండపి సమన్వయకర్త ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే ప్రాణమన్నారు. నాయకులను గెలిపించేది, వారి కోసం త్యాగాలు చేసేది కార్యకర్తలేనన్నారు. త్రిపురాంతకం ఎంపీపీ ఎన్నికల సమయంలో తన మీద ఎల్లో మీడియాలో విపరీతంగా ట్రోల్ చేశారని, పార్టీ కోసం ఏం చేయడానికైనా తాను సిద్ధమేనని చెప్పారు. మాజీ మంత్రి, సంతనూతలపాడు సమన్వయకర్త మేరుగు నాగార్జున ప్రసంగిస్తూ గత ఎన్నికల్లో చంద్రబాబుకు ఓట్లేసిన వారంతా ఇప్పుడు తప్పు చేసినట్లు బాధపడుతున్నారన్నారు. పొగాకు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు జిల్లాకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా జగన్ వచ్చి తీరుతారని స్పష్టం చేశారు. మార్కాపురం సమన్వయకర్త అన్నా రాంబాబు ప్రసంగిస్తూ ఒంగోలు సభ జిల్లాకే స్ఫూర్తినిచ్చిందన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఈసారి కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు.

ప్రజలను మోసం చేస్తున్న బాబు : జూపూడి

పార్టీ రాష్ట్ర కార్యదర్శి జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో నాయకులకు కొరత లేదన్నారు. జగనన్న ఇస్తానన్న దానికి రెట్టింపు ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒట్టిచేతులు చూపుతున్నారని ఎద్దేవా చేశారు. ఏడాదిన్నర పాలనలో లక్షన్నర కోట్ల అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించారని విమర్శించారు. ప్రపంచ స్థాయి రాజధాని సంగతి దేవుడెరుగు.. కనీసం మంగళగిరి స్థాయి నగరాన్ని అయినా నిర్మించగలరా అని ప్రశ్నించారు. పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పార్టీ కమిటీలు వేయాలని, పార్టీని అన్నివిధాలుగా బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన చుండూరి రవిబాబు ప్రసంగిస్తూ సమష్టి కృషితో పార్టీని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. సమావేశం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కనిగిరి సమన్వయకర్త దద్దాల నారాయణయాదవ్, వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకుడు కొమ్మూరి కనకారావు, ప్రచార కమిటీ అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్, నగర అధ్యక్షుడు కటారి శంకర్‌రావు, వివిధ విభాగాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నాయకులు

పచ్చనేతల తెగింపు.. తహసీల్దార్ బరితెగింపు..!

- పశువుల మేత భూములు కాజేసేందుకు చక్రం తిప్పిన టీడీపీ నేతలు
- ఆదివారం కార్యాలయ తలుపులు వేసుకుని మరీ ఆన్‌లైన్ చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది
- గతంలో కలెక్టర్ హోల్డ్‌లో పెట్టినప్పటికీ.. నిబంధనలకు తూట్లు
- కాసులకు కక్కుర్తిపడి గుట్టుచప్పుడు కాకుండా ఆన్‌లైన్ పనులు
- విషయం తెలుసుకుని వెళ్లి నిలదీసిన గ్రామస్తులు
- తమకు అన్యాయం చేయవద్దంటూ తహసీల్దార్‌తో గగ్గోలు



తహసీల్దార్ జ్వాలా నరసింహారావును ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

మద్దిపూడి: టీడీపీ నేతల భూ దాహం, రెవెన్యూ అధికారుల ధన దాహానికి ఆదివారం మద్దిపూడి తహసీల్దార్ కార్యాలయం తలుపులు తెరుచుకున్నాయి. పని దినాల్లోనే కార్యాలయాలకు ఆలస్యంగా వచ్చి అరకొరగా పనిచేసి వెళ్లిపోయే తహసీల్దార్ జ్వాల నరసింహారావు ఒక వీఆర్‌ఓ, మరొక ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్‌ను దగ్గర పెట్టుకుని భూముల ఆన్‌లైన్ పనులను బిజీబిజీగా చేస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయ తలుపులు మూసివేసి మరీ ఆదివారం గుట్టుచప్పుడు కాకుండా భూముల ఆన్‌లైన్ నమోదు పనులు చేపట్టారు. మద్దిపూడి పరిసరాలలోని పశువుల మేత భూమిని టీడీపీ నాయకుల పేర్లపై ఆన్‌లైన్ చేస్తున్నట్లు తెలుసుకున్న గ్రామస్తులు నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్‌ను నిలదీశారు. ఎవరి పేరుతో అయితే ఆన్‌లైన్ చేస్తున్నారో.. వారు హక్కుదారులు కాదని, నకిలీ పత్రాలు సృష్టించిన వ్యక్తులకు ఆన్‌లైన్ చేయడం తగదని అధికారులపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన తమకు అన్యాయం చేయవద్దంటూ వేడుకున్నారు. 60 ఏళ్లుగా తమ స్వాధీనంలో ఉన్న భూములను కాసులకు కక్కుర్తిపడి మరొకరికి ఆన్‌లైన్ చేయవద్దని అధికారులను కోరారు. తెలుగు తమ్ముళ్ల కనుసన్నల్లోనే అధికారులు ఈ తంతు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపించారు.

ఇదీ అసలు కథ...

మండల కేంద్రమైన మద్దిపూడిలో శ్రీవృధులగిరి లక్ష్మీ నృసింహస్వామి కొండ సమీపంలో సర్వే నంబర్ 990–1లో 327.27 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని వెంకటగిరి రాజావారు తన హయాంలో పలు గ్రామాల వారు ఉమ్మడిగా పశువులు మేపుకునేందుకు వదిలారు. విపత్కర పరిస్థితులు ఎదురుకాకుండా ఉండేందుకు పలు గ్రామాలకు చెందిన 57 మంది పేర్లతో అప్పటి రెవెన్యూ అధికారులు రికార్డుల్లో నమోదు చేశారు. ఈ క్రమంలో 57 మంది వంశీకుల వారసులు కొందరు ఆ భూమిని ఒకరికి తెలియకుండా మరొకరికి అమ్ముకున్నారు. గత టీడీపీ హయాంలో రిజిస్ట్రేషన్‌లు కూడా చేశారు. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ ఆ భూమి అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉక్కుపాదం మోపి బ్లాక్‌లిస్టులో పెట్టారు. ప్రస్తుతం మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నేతలు మరోసారి భూ అక్రమాలకు తెరలేపారు. ఆ భూమిని కొందరు హక్కుదారులు సాగుచేసుకుంటుండగా, మరికొంతమంది రైతులు అలాగే వదిలేశారు. మండలంలోని గుండ్లసముద్రం, రేగలగడ్డ, మద్దిపూడి, గంగపాలెం, పొట్టిరెడ్డిపాలెం తదితర గ్రామాలకు చెందిన వారు పశువులు మేపుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పశువుల బీడుపై కన్నుపడింది. తెలుగు తమ్ముళ్ల ఒత్తిడితో పాటు కాసులకు కక్కుర్తిపడిన స్థానిక తహసీల్దార్.. ఆదివారం బీడు భూమిని అక్రమార్కుల పేరుతో ఆన్‌లైన్ పనులు చేపట్టారు. పమిడి రమేష్‌బాబు పేరుతో సర్వే నంబర్ 990–1సీ20లో 17.10 ఎకరాలు, నల్లూరి శ్రీనివాసరావు పేరుతో సర్వే నంబర్ 990–1సీ24లో 11.40 ఎకరాలు, నేరెళ్ల ఏడుకొండలు పేరుతో 990–1సీ4ఏలో 2.85 ఎకరాలు, 990–1సీ4ఏలో 2.85 ఎకరాలను ఆన్‌లైన్ చేశారు. విషయం తెలుసుకున్న ఆ భూమి వారసులైన గొంటు హనుమాయమ్మ, గొంటు వెంకట నర్సింహారెడ్డి, సూరే రమణారెడ్డి, మరికొంతమంది భూహక్కుదారులు వెళ్లి తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమిని ప్రైవేటు వ్యక్తులకు ఆన్‌లైన్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎఫ్ఎల్ఆర్‌లో ఉన్న పేర్లకు నకిలీ వారసులను సృష్టించి వారితో రిజిస్ట్రేషన్ చేయించుకుని పాస్‌పుస్తకాలు మంజూరు చేయడం ఏమిటని ముకుమ్మడిగా తహసీల్దార్‌ను నిలదీశారు. ఆధారాలను పరిశీలించి ముందుగా తమకు ఆన్‌లైన్ చేయాలన్నారు. అసలైన వారసులను మీరు ఎలా గుర్తించారో.. మా పొలానికి వారు వారసులు ఎలా అవుతారో చెప్పాలని నిలదీశారు. తమకు అన్యాయం చేయవద్దని వేడుకున్నారు. దీంతో కంగుతిన్న తహసీల్దార్.. ఆధారాలు తీసుకువస్తే పరిశీలిస్తానని చెప్పారు. అయితే, సంబంధిత ఆధారాలను ఇప్పటికే మూడు సార్లు రెవెన్యూ కార్యాలయంలో అధికారులకు అందజేశామని రైతులు తెలిపారు. దీంతో ఏం చేయాలో అర్థంగాక తహసీల్దార్ వెళ్లిపోయారు.



తహసీల్దార్, సిబ్బంది లోపల ఉండి కార్యాలయ తలుపులు మూసివేసిన దృశ్యం



కొండపోరంబోకు భూమిలో వేసిన బోరును అడ్డుకుంటున్న గ్రామస్తులు

అధికార పార్టీ అండగా..అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ గద్దల్లా వాలిపోయి తన్నుకుపోతున్నారు. ప్రభుత్వ భూముల సమాచారం సేకరిస్తున్న పెద్దలు ఆ భూములు దర్జాగా కబ్జా చేసేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఆక్రమణల పర్వం జోరందుకుంది. అధికార పార్టీ నేతల అండ, అధికారుల సహకారంతో వందల ఎకరాలను గుప్పిట్లో పెట్టుకుంటున్నారు.

కొండపోరంబోకు భూములపై

డేగల కన్ను

దళారులకు కాసుల వర్షం కురిపిస్తున్న కొండపోరంబోకు భూములు

- 67 ఎకరాలు ఆక్రమించి విక్రయం
- భూములు స్వాధీనం చేసుకుంటుండగా అడ్డుకున్న గ్రామస్తులు
- ఆక్రమణదారులకు అధికార పార్టీ నేతల అండ

కురిచేడు: మండలంలోని పెద్దవరం రెవెన్యూ పరిధిలోని కొండపోరంబోకు భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. అధికార పార్టీ అండదండలతో పెద్ద పెద్ద డేగలు ఈ భూములపై వాలాయి. వివరాల్లోకి వెళితే..మండలంలో పెద్దవరం సర్వే నంబర్ 306 లో 630 ఎకరాల కొండపోరంబోకు ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిని చాలా మంది ఆ ప్రాంత ప్రజలు ఆక్రమించుకొని సాగు చేసుకుంటున్నారు. కానీ ప్రస్తుతం ఏకంగా పక్కా జిల్లాల నుంచి ఆక్రమణదారులు రంగప్రవేశం చేశారు. వినుకొండకు చెందిన ఆదినారాయణ అనే వ్యక్తి సదరు సర్వే నంబర్‌లోని 67 ఎకరాలను ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రాంతానికి చెందిన వారికి విక్రయించి రూ.2 కోట్లు దండుకున్నాడు. మండలంలోని ఎస్ఎస్‌పీ అగ్రహారం గ్రామానికి చెందిన వ్యక్తి మధ్యవర్తిత్వం వహించి ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన చింతోటి వరప్రసాదు, నందిగం మండలం కొత్తబెల్లం కొండవారిపాలెం గ్రామానికి చెందిన పొన్నగంటి రమేష్, విజయవాడ భవానీపురం గ్రామానికి చెందిన చావ మదన్‌మోహన్, వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన కంతేటి వీరాంజనేయులు, చందర్లపాడుకు చెందిన కె.వెంకటేశ్వరరావు, బెల్లంకొండవారిపాలెం గ్రామానికి చెందిన కడియాల సుబ్బారావులకు ఆ భూములు విక్రయించారు. ఆ భూముల్లో సాగు చేసేందుకు ఇటీవల కాలంలో సుమారు 9 బోర్లు సైతం వేయించారు. ఈ క్రమంలో ఆదివారం 20 మందికి పైగా వచ్చి ఆ భూముల్లో సాగుకు ప్రయత్నాలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద సంఖ్యలో భూమల వద్దకు చేరుకున్నారు. సాగు చేస్తున్న వారిని అడ్డుకొని రెవెన్యూ, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వీఆర్‌ఓ సంఘటనా స్థలానికి చేరుకొని భూములు సాగుచేసేందుకు వచ్చిన వారిని, వారి వాహనాలు, జనరేటర్, ఇతర మిషన్లను పోలీసులకు అప్పగించారు.

గ్రామస్తులను ప్రలోభపెట్టేందుకు..

భూములు స్వాధీనం చేసుకునేందుకు వచ్చిన ఆక్రమణదారుల వద్ద ఎటువంటి పట్టాలు గానీ, ఎటువంటి పత్రాలు లేని లేవు. కానీ గ్రామస్తులను మభ్యపెట్టేందుకు ప్రయత్నించారు. కోట్లాను కోట్లు వెచ్చించి తాము కొనుగోలు చేశామని ఒకసారి, లీజుకు తీసుకున్నామని, సాగు చేసుకుంటున్న రైతులు లీజుకు ఇచ్చారని..ఆదినారాయణ లీజుకు ఇచ్చారని, రకరకాలుగా మాట్లాడి అధికారులను, గ్రామస్తులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారు. మాకు కూటమి నాయకులతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఎలాగైనా ఆ భూములను స్వాధీనం చేసుకుంటామని, అధికారులతో మంతనాలు చేయడం విశేషం. ఈ ఆక్రమణదారులకు అండగా ఉన్న ప్రజాప్రతినిధులు, ఆక్రమణదారులు ఎవరని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

అధికారుల అలసత్వం..

గత 20 ఏళ్లుగా ఈ కొండపోరంబోకు భూముల ఆక్రమణలు, వివాదాలు చోటుచేసుకుంటున్నా ప్రభుత్వ అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోలేదు. దీంతో తరుచూ వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రభుత్వ కర్మాగారాలకు ఈ భూములు కేటాయించి అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కనీసం ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. తహసీల్దార్ ఆదేశాల మేరకు భూములు కొనుగోలు చేసిన వారిని, తెచ్చిన వాహనాలను పోలీసులకు అప్పగించాం. భూముల ఆక్రమణలపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం.

– రమాదేవి, వీఆర్‌ఓ

అధికారులకు ముందే చెప్పాను



ప్రభుత్వ భూముల్లో బోర్లు వేస్తున్నారని తహసీల్దార్‌కు రెండు సార్లు ఫిర్యాదు చేశాం. ఒకసారి వీఆర్వోను పంపారు. ఆ సమయంలో బోర్లు వేయలేదు. రాత్రికి రాత్రి బోర్లు వేశారు. మా భూములు కాపాడండి. భూములు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలి.

– మార్నెళ్ల రామాంజి, గ్రామస్తుడు

ఎవరు వచ్చినా అడ్డుకుంటాం ..



ప్రభుత్వ భూములు మా నాన్న సర్పంచ్ కాలంలో ఇలాగే ఆక్రమణలు జరిగాయి. అప్పుడు అడ్డుకున్నాం. ఇప్పుడు మళ్లీ ఆక్రమించాలని చూస్తున్నారు. వాటిని కాపాడుకుంటాం. ఎవరు వచ్చి అడ్డుకుంటాం. ప్రభుత్వ కర్మాగారాలకు ఈ భూములను ఉపయోగించుకోవచ్చు.

– మార్నెళ్ల కాశీ వెంకట చెన్నకేశవులు,మాజీ సర్పంచ్



దళారులు విక్రయించిన కొండపోరంబోకు భూమి



అధికారుల సమక్షంలో కొనుగోలు చేసిన వారిని అడ్డుకున్న గ్రామస్తులు

పొగాకు రైతులపై పచ్చపాతం



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బూచేపల్లి శివప్రసాదురెడ్డి

- మద్దతు ధర కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- రైతుల కష్టాలు తెలుసుకునేందుకే ఈ నెల 28న పొదిలికి వైఎస్ జగన్ రాక
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదురెడ్డి

పొదిలి రూరల్: కష్టాల్లో ఉన్న పొగాకు రైతులను ఆదుకోవాల్సిన కూటమి ప్రభుత్వం వారిపై పచ్చపాతం చూపుతోందని, మద్దతు ధర కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు ఈ నెల 28వ తేదీ ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి వస్తున్నారని తెలిపారు. జగన్ రాక కోసం హెలిప్యాడ్‌కు అనువైన స్థలాలను పొదిలి పట్టణంలోని దర్శి రోడ్డులో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదురెడ్డి, స్థానిక తహసీల్దారు కృష్ణారెడ్డితో కలిసి ఆదివారం చెవిరెడ్డి పరిశీలించారు. ఎస్ఎస్ఆర్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న విశాలమైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పొదిలి పొగాకు వేలం కేంద్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. రైతులను ఓదార్చడం, ధైర్యం చెప్పడం, వారి భవిష్యత్ కోసం పోరాటానికి సిద్ధమవడం కోసం ఆయన వస్తున్నట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి తమ బాధలు చెప్పుకోవడానికి రైతులంతా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికీ కనీస సహాయం అందలేదన్నారు. అన్నదాతలు పండించిన కంది, వరి, మిరప పంటలకు సరైన ధర లేకపోవడంతో ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పొగాకు రైతుకు గత నాలుగేళ్లతో పోల్చుకుంటే ఈ సంవత్సరం బ్యారన్, పొలం కౌలు, పెట్టుబడి బాగా పెరిగిందన్నారు. గతేడాది వచ్చిన ఆదాయంతో పోల్చుకుంటే ఈ ఏడాది రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరలు చూస్తే రైతులకు దిక్కుతోచడం లేదన్నారు. ఎక్కడచూసినా పొగాకు బేళ్లు అమ్ముడుపోక, పెట్టిన పెట్టుబడి రాక రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో వచ్చిన ధరలు ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదన్నారు. రైతుల కోసం మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి జగనన్న అండగా నిలిచారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెరిచి రైతులకు మేలు చేయాలని కోరారు. పొగాకు పంటకు మద్దతు ధర వచ్చేంత వరకు రైతులకు వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందన్నారు. రైతుల పక్షాన ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తుందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ప్రతి గ్రామం నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి భాగస్వామ్యం కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28న పొదిలిలో తలపెట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. పొగాకు రైతులు తీవ్రంగా నష్టాల పాలవుతున్నా ప్రభుత్వం పట్టీపట్టనట్లు వ్యవహరించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రైతుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు పొదిలికి వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ నాయకులకు విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ చీమకుర్తి పట్టణ అధ్యక్షుడు క్రిష్టిపాటి శేఖరరెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు పమిడి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్లు బాపతు వెంకటరెడ్డి, ఎస్.మాణిక్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, గోపురపు చంద్ర, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు మృతి

పొదిలి: ఆర్టీసీ డిపో బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఇన్ గేట్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. కొనకనమిట్ల మండలం బచ్చలకూరపాడు పంచాయతీ మెట్టువారిపల్లి గ్రామానికి చెందిన మెట్టు మాధవరెడ్డి(27) బస్టాండ్ ఎదురుగా సాయిసూర్య లాడ్జిలో పనిచేస్తుంటాడు. ఆదివారం బస్టాండ్ వద్ద రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని కిందపడి చక్రాలు ఎక్కడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విజయవాడలో ఉంటున్న మాధవరెడ్డి ఇటీవలే స్వగ్రామం వచ్చి లాడ్జిలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వవిరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇంటిపై పిడుగు



పిడుగుపాటుకు పాక్షికంగా దెబ్బతిన్న ఇంటిపై కప్పు

ముండ్లమూరు(కురిచేడు): ముండ్లమూరు మండలంలోని తూర్పు కంభంపాడు గ్రామంలో ఇంటిపై పిడుగు పడింది. ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదు. గ్రామంలోని తొట్టెంపూడి ధనలక్ష్మి ఇంటిపై కప్పు చివరన పిడుగుపడి కప్పు విరిగి ఇంటిపక్కన భూమిలోకి వెళ్లిపోయింది. ఇంటి పైకప్పు పాక్షికంగా దెబ్బతింది. పిడుగుపాటుకు చుట్టుపక్కల 12 గృహాల్లోని గృహోపకరణాలు షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యాయి. ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్, కూలర్, మిక్సీలు కాలిపోవడంతో సుమారు రూ.5 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి జేవీవీ కృషి

పొదిలి: శాస్త్రీయ సమాజ నిర్మాణానికి జన విజ్ఞాన వేదిక 37 ఏళ్లుగా అలుపెరుగని కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి మురళీధర్ అన్నారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో ఆదివారం జిల్లాస్థాయి విస్తృత సమావేశం జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి గురుస్వామి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సభ్యత్వ నమోదు పోస్టర్ ఆవిష్కరించారు. మురళీధర్ మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలన కోసం, సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ, అందరికీ నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం కల్పించాలనే ఆశయ సాధన కోసం జేవీవీని స్థాపించారన్నారు. ఉపాధ్యాయులు, డాక్టర్లు, ఇంజినీర్లు, మేధావులు, విద్యావంతులు జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని కోరారు.రాష్ట్ర కమిటీ సభ్యులు వి.మాలకొండారెడ్డి, పి.స్వరూపరెడ్డి మాట్లాడుతూ ఆర్థిక, సామాజిక సమస్యలకు సైన్సు మాత్రమే పరిష్కారం చూపిస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సైన్సుకు, పరిశోధనలకు, అధ్యయనాలకు తగినన్ని నిధులు కేటాయించి ప్రోత్సహించాలన్నారు. జిల్లా మహాసభలను ఆగస్టు 9వ తేదీన గిద్దలూరులో నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.జయప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షులు ఖాజా హుస్సేన్, యు.వెంకటరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూదాల దేవప్రసాద్, ఎస్ఎండీ.రఫీ, జి.శ్రీనివాసరెడ్డి, ఏ.వి శ్వరూపం, వి.వెంకటేశ్వర్లు, ఎస్‌వి.రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- పెట్టుబడులు, గిట్టుబాటు ధరల మధ్య భారీ వ్యత్యాసం
- మందకొడిగా సాగుతున్న కొనుగోళ్లు
- నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఊహించని ధరలు
- కూటమి ప్రభుత్వంలో తిరగబడిన పరిస్థితులు



రాచర్ల మండలం పలుగుంటిపల్లెలో పొగాకును తగులబెడుతున్న రైతులు (ఫైల్)

పొగాకు రైతుపై

ధరల కాటు!

మార్కాపురం / తర్లుపాడు: పొగాకు రైతుల పరిస్థితి రోజు రోజుకూ దయనీయంగా మారుతోంది. కూటమి ప్రభుత్వంలో బయ్యర్లు కుమ్మక్కై ధరలు తగ్గిస్తుండటంతో గిట్టుబాటు ధరలు లేక రైతులు అవస్థలు పడుతున్నారు. దీంతో వేలం ప్రారంభమై రెండు నెలలు దాటినా ధరల అనిశ్చితి మాత్రం కొనసాగుతూనే ఉంది. ఈ ఏడాది భారీగా పెరిగిన పెట్టుబడులకు, వేలం కేంద్రాల్లో వస్తున్న ధరల మధ్య భారీ వ్యత్యాసం ఉంది. భారీగా పెరిగిన పెట్టుబడుల నేపథ్యంలో ఈ ఏడాది పొగాకు రైతులు అష్టకష్టాలు పడ్డారు. ఈ పరిస్థితుల్లో వేలంలో సరైన ధరలు రాకపోవడం, నిత్యం వందల సంఖ్యలో బేళ్లను కొనుగోలు చేయకుండా వ్యాపారులు తిరస్కరిస్తుండటంతో సహనం నశించిన రైతులు తక్కువ ధరకు అమ్ముకోలేక పొగాకును తగులబెడుతున్నారు.

మందకొడిగా కొనుగోళ్లు

పశ్చిమ ప్రకాశంలో పొదిలి పొగాకు వేలం కేంద్రం పరిధిలో 13 మండలాలు ఉన్నాయి. పొదిలి, మర్రిపూడి, కొనకనమిట్ల, దర్శి, దొనకొండ, బేస్తవారపేట, కంభం, గిద్దలూరు, తర్లుపాడు, అర్ధవీడు, పెద్దారవీడు, కురిచేడు, మార్కాపురం మండలాలు ఉన్నాయి. మొత్తం 4,390 మంది రైతులు పొగాకును సాగు చేస్తున్నారు. 2,601 బ్యార్నీలు ఉండగా అధికారికంగా 8,534 హెక్టార్లలో పొగాకు సాగు చేయగా అనధికారికంగా మరో 2,497 హెక్టార్లలో సాగు చేశారు. మొత్తం 11.10 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేయాలని నిర్ణయించారు. అయితే ఇప్పటి వరకు కొనుగోళ్ల మందకొడిగా సాగాయి. వేలంలో వ్యాపారులు కుమ్మక్కవడంతో పోటీ లేక రైతులకు అన్యాయం జరుగుతోంది.

ఏడాదిలో అంతా తారుమారు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పొగాకు పంటకు మంచి ధర లభించింది. కానీ ఏడాదిలో అంత తారుమారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్కసారిగా ధరలు దిగజారిపోయాయి. గత ఏడాది కేజీ రూ.360 పైచిలుకు పలకగా ఈ ఏడాది గరిష్ట ధర రూ.280 మించి పలకలేదు. ఇక కనిష్ట ధరలు రోజు రోజుకు నేల చూపులు చూస్తున్నాయి. వైఎస్సార్ సీపీ హయాంలో మార్క్‌ఫెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు రంగంలోకి దిగడంతో వ్యాపారుల మధ్య పోటీ నెలకొంది. దీంతో వ్యాపారులు పోటాపోటీగా కొనుగోలు చేయడంతో గతంలో ఎన్నడూ లేనంతగా ధరలు పెరిగాయి. రైతులకు కాసుల వర్షం కురిసింది. అదే ఉత్సాహంతో ఈ ఏడాది రైతులు భారీగా పెట్టుబడులు పెట్టారు. కానీ వేలం ప్రారంభమైన రోజు నుంచి నేటి వరకు ధరలు రోజు రోజుకు దిగజారుతూనే ఉన్నాయి. మార్కాపురం మండలంలోని కొండేపల్లి, మిట్టమీదిపల్లి, ఎల్‌బియస్ నగర్, వేములకోట,వేములపేట, తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, కలుజువ్వలపాడు, చెన్నారెడ్డిపల్లి, తాడివారిపల్లి, తర్లుపాడు తదితర గ్రామాల్లో పొగాకు సాగుచేశారు.

పొగాకు తగులబెడుతున్న రైతులు

రోజులు గడుస్తున్నా ధరల్లో మార్పు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలాన్ని బహిష్కరించి పొగాకు బేళ్లను రోడ్డు మీదకు తీసుకువచ్చి తగులబెట్టి నిరసన తెలియజేస్తున్నారు. అయినా రైతుల గోడును ఆలకించే వారే కరువయ్యారు. రాచర్ల మండలం పలుగుంటిపల్లి గ్రామంలో పొగాకు రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక వారం క్రితం తగులబెట్టారు.

క్వింటాకు రూ.10 వేల వ్యతాసం



గత మూడేళ్లలో మంచి ధరలు రావడంతో ఈ ఏడాది ఎంతో ఆశతో 21 ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. గతంతో పోలిస్తే పెట్టుబడులు భారీగా పెరిగాయి. ధర ఉంటే పెట్టుబడులు ఏముందన్న ఆశతో ఉన్నాం. కానీ వేలం ప్రారంభం నుంచి రైతులను మోసం చేస్తున్నారు. గత ఏడాది రూ.36 వేలు పలికిన క్వింటా ఈ ఏడాది రూ.26 వేలకు కూడా కొనే పరిస్థితి లేదు. క్వింటాకు రూ.10 వేల తేడా ఉంది. ప్రభుత్వం జోక్యం చేసుకోకుంటే పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతారు.

– రేగుల అంకయ్య, రైతు



తర్లుపాడులో రైతులు సాగు చేసిన పొగాకు పంట

టీడీపీ వర్గీయుల బాహాబాహీ..

- కె.బిట్రగుంటలో ఒకరిపై ఒకరు దాడులు
- మంత్రి డోలా వర్సెస్, మారిటైం బోర్డు చైర్మన్ సత్య వర్గాలుగా విడిపోయిన టీడీపీ వర్గీయులు
- గాయపడ్డ ఇద్దరిలో ఒకరు కొండపికి, మరొకరు రిమ్స్‌కు తరలింపు
- కె.బిట్రగుంటలో రెండు వర్గాల మధ్య ముదిరిన వివాదం

సాక్షి నెట్‌వర్క్: జరుగుమల్లి మండలంలోని కె.బిట్రగుంట గ్రామం తెలుగుదేశం పార్టీలో రెండు వర్గాల మధ్య ఆధిపత్య పోరులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటన ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ, వయోవృద్ధులు, గ్రామ వలంటీర్లు, గ్రామ సచివాలయ, దివ్యాంగులు శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయస్వామి గ్రామంలోని ఒట్టిగుంట శివాజీ వర్గానికి మద్దతు తెలుపుతుండగా, చిమ్మిరి బ్రహ్మయ్య వర్గానికి రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మద్దతు ఇస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో దామచర్ల సత్య, మంత్రి స్వామి మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నియోజకవర్గంలో జరుగుతున్న సంఘటనలతో వీరి మధ్య అంతర్గతంగా విభేదాలు తలెత్తినట్టు ప్రచారం జరుగుతోంది. దీనికి బలం చేకూర్చేలా నియోజకవర్గంలో టీడీపీ వారు రెండు వర్గాలుగా విడిపోయారన్న దానికి కె.బిట్రగుంట ఘటనే సాక్ష్యమని ఆ పార్టీ నేతలే ధ్రువీకరిస్తున్నారు. గ్రామానికి చెందిన చిమ్మిరిబ్రహ్మయ్య సర్పంచ్ అభ్యర్థి రేసులో ఉన్నాడు. ఈయన ఆదివారం ఉదయం పశువులకు గడ్డి తీసుకుని మోటారుసైకిల్ పై ఇంటికి వెళుతుండగా గ్రామ సెంటర్లో టీ తాగుతున్న శివాజీ అటుగా వెళ్తున్న బ్రహ్మయ్యను ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో బ్రహ్మయ్య గడ్డి ఇంటి దగ్గర పడేసి తిరిగి వచ్చే క్రమంలో దారిలో ఒక మహిళతో శివాజీ తనను తిడుతున్నాడని చెబుతుండగా అక్కడికి వచ్చిన శివాజీ తన చేతిలోని కప్పులో ఉన్న టీని బ్రహ్మయ్య ముఖంపై పోసి కాలితో తన్నడంతో అతను మోటారుసైకిల్‌తో సహా కింద పడిపోయాడు. శివాజీ అంతటితో ఆగకుండా బ్రహ్మయ్యపై దాడిచేస్తూనే ఉన్నాడు. ఆ సమయంలో అక్కడ ఉన్న మహిళ కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారు వచ్చి శివాజీని పక్కకు లాగటంతో అతను అదుపుతప్పి పడిపోయాడు. తరువాత గాయపడ్డ బ్రహ్మయ్యను 108లో ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా శివాజీ కూడా దెబ్బలు తగిలాయంటూ కొండపి ఏరియా ఆస్పత్రికి 108లో వెళ్లాడు. ఈ ఘటనలో బ్రహ్మయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ జరిగిన వెంటనే సింగరాయకొండ ఎస్సై బి.మహేంద్ర గ్రామానికి వచ్చి శివాజీకి బందోబస్తుగా ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. శివాజీని ఎవరు గాయపరచలేదని అతనే గాయపరచుకుని రక్తం కారిన ఫొటోలు తీయించుకున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల గ్రామంలో చర్చనీయాంశంగా మారిన అంబేడ్కర్ ఊరేగింపును అడ్డుకున్న ఘటనలో బ్రహ్మయ్య వర్గీయులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు కావటం వెనుక శివాజీ హస్తముందని సత్య వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కేసు ఐదుగురిపై నమోదు కాగా వారిలో ముగ్గురు దామచర్ల సత్య కుటుంబానికి అత్యంత సన్నిహితులని విశ్వసనీయ సమాచారం. కొండపి నియోజకవర్గంలో డోలా, సత్య వర్గాలుగా టీడీపీ సానుభూతిపరులు విడిపోయారని, రానున్న రోజుల్లో వీరి మధ్య ఆధిపత్య పోరు గ్రామస్తులకు, అధికారులకు తలనొప్పిగా మారే అవకాశముందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిమ్మిరి బ్రహ్మయ్య



కొండపి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివాజీ